నకిలీ పత్రాలతో స్థలం కబ్జాకు యత్నం

- ఆరుగురి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు
- అడ్డంగా బుక్కైన పద్మజారెడ్డి
- గతంలో వివిధ కమిషనరేట్ల పరిధిలో కేసు నమోదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సురేష్‌కుమార్

జీడిమెట్ల: ఖాళీ స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాకు యత్నించిన ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, బాలానగర్ ఏసీపీ హనుమంతరావు జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్‌లతో కలిసి డీసీపీ కె.సురేష్‌కుమార్ వివరాలను వెల్లడించారు. డివిజన్ పరిధిలోని వెంకటాద్రినగర్ సర్వే నెంబర్ 33బై8 33బై11లో లెంద్యాల సురేష్‌కు చెందిన రూ.కోటి విలువ చేసే 200 గజాల ఖాళీ స్థలం ఉంది. అతను ఉప్పుగూడలో ఉంటున్నాడు. స్థలం ఖాళీగా ఉండటంతో సుభాష్‌నగర్‌కు చెందిన పద్మజారెడ్డి (పద్మక్క) సదరు స్థలంపై కన్నేసి ఆక్రమించేందుకు యత్నించింది. అనుకున్నట్లుగా వరుసకు సోదరీ అయ్యే ఇదే ప్రాంతానికి చెందిన నాగిరెడ్డి కోమల కుమారి(49)పేరుతో నకిలీ పత్రాలను సష్టించింది. పత్రాలకోసం పెద్ద అంబర్‌పేట్‌కు చెందిన గగనం నరేంద్ర అలియాస్ నందు(25), గుంటూరు సాకేతపురం ప్రాంతానికి చెందిన వత్రం రవిశంకర్, అదే జిల్లా కేరటిపాడు ప్రాంతానికి చెందిన మేకల హరీష్, హయత్‌నగర్‌కు చెందిన రేపాక కరుణాకర్‌ను ఆశ్రయించింది. వారితో కలిసి నకిలీ పాన్‌కార్డులను తయారు చేయించి ఆధార్ కార్డుల్లో, పేర్లలో మార్పులు చేయించారు. సదరు కార్డులను ఉపయోగించి స్థల యజమాని మృతి చెందినట్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులను తప్పుదోవ పట్టించారు. అధికారులు సమగ్రంగా విచారించకుండానే నాగిరెడ్డి కోమల కుమారి పేరుతో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారు. సదరు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి లోపల ఓ చిన్నపాటి డబ్బాను ఏర్పాటు చేశారు.

బండారం బయటపడిందిలా..

ఇటీవల స్థల యజమాని సురేష్ తన స్థలాన్ని పరిశీలించేందుకు వెంకటాద్రినగర్‌కు వెళ్లారు. తన స్థలంలో గోడ నిర్మాణం చేపట్టి ఉండటాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. పద్మజారెడ్డి అనే మహిళా కబ్జా చేసినట్లు తెలుసుకున్నాడు. వెంటనే ఆమెను కలిసి స్థలం నాదని, మీరేలా ఆక్రమించుకుంటారని ప్రశ్నించాడు. తన వద్ద పక్కాగా పేపర్లు ఉన్నాయని, మీకు, ఈ స్థలానికి ఎలాంటి సంబంధం లేదంటూ సురేష్‌ను ఆమె బెదిరించింది. దీంతో బాధితుడు తన వద్ద ఉన్న ఒరిజినల్ పత్రాలతో జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ చేపట్టిన ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తన విచారణలో పద్మజారెడ్డి పథకం ప్రకారం కబ్జాచేసినట్లు తేల్చాడు. దర్యాప్తు అనంతరం కోమల, పద్మజారెడ్డి, నరేంద్ర, వత్రం రవిశంకర్, మేకల హరీష్, రేపాక కరుణాకర్‌లను శుక్రవారం రిమాండుకు తరలించారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. వీరిపై రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు పీఎస్‌లలో కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నకిలీపత్రాల తయారీ కోసం వినియోగించిన రెండు ల్యాప్‌టాప్‌లు, ఆధార్ వేలిముద్ర యంత్రం, కంటి స్కానర్‌లు, నాలుగు సెల్‌ఫోన్‌లతో పాటు నకిలీ పాన్‌కార్డు, అధార్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. మరికొంత మందిని విచారించి ప్రమేయం ఉన్నవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జూబ్లీహిల్స్, హయత్‌నగర్, ఏపీలోని విశాఖపట్నంలో స్థలాలను కూడా నిందితులు కబ్జా చేసేందుకు ప్రయత్నించినట్లు తేలింది. సదరు స్థలాలకు సంబంధించిన ఫేక్ డాక్యుమెంట్లను సైతం సీజ్ చేశామని పోలీసులు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ జ్యోతిపైన కూడా కేసు నమోదైంది.

సొసైటీల ద్వారా ఇళ్ల స్థలాలివ్వాలి

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య



మాట్లాడుతున్న మామిడి సోమయ్య

కుత్బుల్లాపూర్: జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీల ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలని, సొసైటీలలో లేని అర్హుల జాబితాను ప్రభుత్వం రూపొందించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సూరారంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన సంఘం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పులివలుపుల ఆనందం, కార్యదర్శులు ఎస్ కె సలీమా, తన్నీరు శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఒక జర్నలిస్టు యూనియన్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆ యూనియన్ చేస్తున్న అనధికారిక కార్యకలాపాలకు మీడియా అకాడమీ చైర్మన్ మద్దతు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సమాచార శాఖ ద్వార ప్రక్రియ చేపట్టాలని, లేదంటే అధికారులు, జర్నలిస్టు యూనియన్ల ప్రతినిధులు, సీనియర్ పాత్రికేయులతో కమిటీ వేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

సీఎంఆర్ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం

కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో టి.వెంకటేశ్వర్లుకు రూ.1.10 లక్షలు, ఎస్.లక్ష్మీనారాయణకు రూ.2.75 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు.

గౌడ సంఘం సమావేశానికి హాజరు

కుత్బుల్లాపూర్ గౌడ సంఘం అధ్యక్షుడు కూన రాజ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన గౌడ సంఘం సమావేశానికి ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ హాజరయ్యారు. సమావేశంలో కూన శ్రీరాములుగౌడ్, జైరాజ్ గౌడ్, సుధాకర్‌గౌడ్, వ్యాస్‌గౌడ్, శ్రవణ్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్, మధుగౌడ్ పాల్గొన్నారు.

కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కుత్బుల్లాపూర్: కార్మికులు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఈఎస్ఐ డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని టీఎస్ఆర్‌నగర్ కమిటీ హాల్‌లో మున్సిపల్ కార్మికులు, ఎంటమాలజీ సిబ్బందికి వైద్య శిబిరం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన శిబిరంలో 125 మంది కార్మికులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఉప కమిషనర్ నరసింహ పాల్గొన్నారు.

కౌన్సిలర్ కుటుంబానికి పరామర్శ



కౌన్సిలర్ శంకర్‌నాయక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డు కౌన్సిలర్ శంకర్ నాయక్ మాతృమూర్తి కొర్ర లక్ష్మీభాయి ఇటీవల మృతి చెందారు. బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గాగిల్లాపూర్ తండాలోని శంకర్‌నాయక్ నివాసానికి వెళ్లి లక్ష్మీభాయి చిత్రపటం వద్ద శుక్రవారం నివాళి అర్పించారు. కుటుంబానికి ధైర్యం చెప్పారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్, నాయకులు విజయ్ రామ్‌రెడ్డి, మోహన్ నాయక్, అమర్ సింగ్, రవీందర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తన కార్యాలయంలో సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

డిజిటల్ కార్డు కోసం వివరాల సేకరణ



సర్వేలో భాగంగా వివరాలను సేకరిస్తున్న అధికారులు

కుత్బుల్లాపూర్ : ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం కుటుంబ వివరాలను కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు సేకరిస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని నియోజకవర్గాల వారీగా ఒక్కో ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని సర్వే ప్రారంభించారు. అందులో భాగంగా అయోధ్య నగర్‌లో ఉప కమిషనర్ నరసింహ ఆధ్వర్యంలో 15 బృందాలుగా విడిపోయి ఒక్కొక్కరు ప్రతి రోజు 30 కుటుంబాల వివరాలను సేకరించనున్నారు. మొత్తం కాలనీలో 900 పైగా ఇళ్లు ఉండగా.. ఈనెల 8వ తేదీ లోగా ఈ ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ కార్డు జారీ కోసం సహకరించాలని కోరారు. కుటుంబంలోని అందరి ఆధార్ కార్డులతో పాటు వారు లబ్ధి పొందిన వివరాలు, ఫోన్ నెంబర్ తీసుకొని ఫార్మాట్ చేస్తున్నారు. అయోధ్య నగర్‌లో జరుగుతున్న సర్వేను ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు ఇతర అధికారులు దగ్గరుండి చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలతో పాటు కొత్తగా ఫ్యామిలీ, ఇల్లు ఇక్కడ ఉండి విదేశాలకు వెళ్లిన వారి వివరాలతో ఎంట్రీ చేస్తూ ముందుకు సాగుతున్నారు.

మురుగు సమస్యకు చెక్


సాక్షి ఎఫెక్ట్..



మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయడంతో ఆగిన మురుగు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ పరిధి సినీ ప్లానెట్– జయభేరి కాలనీ రోడ్డులో కొన్ని నెలలుగా కొనసాగుతున్న డ్రైనేజీ లీకేజీకి ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది. రెండేళ్లుగా డ్రైనేజీ రోడ్డుపై పారడంతో అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టడం. మరలా షరా మామూలుగా లీకేజీ ఏర్పడటంపై సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన ‘మురుగు.. పరుగు.’ కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించారు. ఉదయమే సిబ్బందిని లీకేజీ అవుతున్న ప్రాంతానికి పంపించి డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయించి మురుగు ప్రవాహానికి అడుకట్ట వేశారు. కొత్త డ్రైనేజీ పైపులైన్ పనులను త్వరలోనే ప్రారంభించి శాశ్వతంగా సమస్యను పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఆదర్శ రైతు రామచందర్ మృతి



సుభాష్‌నగర్: అక్కడ గజం స్థలం విలువ 80 వేల నుంచి లక్ష రూపాయలు పలుకుతుంది. చుట్టూ నూతన హంగులతో విల్లాలు ఎత్తైన భవనాలు.. మధ్యలో ఆ రైతు.. తాతల నాటి నుంచి సంపాదించిన 25 ఎకరాల స్థలం. తన ఒంట్లో ఉన్న చివరి రక్తం వరకు మట్టినే నమ్ముకుని వ్యవసాయం చేశాడు. తన నలుగురు కుమారులకు అన్నం మెతుకు విలువ చెప్పి, వ్యవసాయం యొక్క గొప్పతనాన్ని వివరించాడు. చివరికి వృద్ధాప్యంలోనూ వ్యవసాయం చేస్తూ కన్నుమూశాడు. చివరకు కుమారులు తన తండ్రి యొక్క భౌతిక కాయాన్ని తమ వ్యవసాయ పొలం చుట్టూ వాహనంలో తిప్పి అంత్యక్రియలు నిర్వహించారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లి కి చెందిన ఆదర్శ రైతు పెద్దనోల్ల రావి చెట్టుకింద రామచందర్ (84) అనారోగ్యంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. రామచందర్ గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఆదర్శ రైతుగా ఎంపికై స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మట్టిని అమ్ముకోకు, నమ్ముకుని జీవించు అన్నది రామచందర్ పదేపదే చెప్తుంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అతని అంత్యక్రియలకు గ్రామస్తులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఆయనకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కుత్బుల్లాపూర్: ఎన్నికల సమయంలో హామీఇచ్చిన ప్రకారం మున్నూరు కాపు కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేందర్ పటేల్ కోరారు. శుక్రవారం కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. పదిహేనేళ్లుగా మున్నూరు కాపు కార్పొరేషన్ కోసం పోరాటాలు చేస్తున్నామని గుర్తు చేశారు. మున్నూరు కాపుల ప్రధాన వృత్తి వ్యవసాయమని, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందించాలన్నారు.